క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో రాహువు విగ్రహ ప్రతిష్ట

కడప కల్చరల్: కడప నగరంలోని తహసీల్దారు కార్యాలయం వెనుక నాగులకట్ట ప్రాంతంలో శుక్రవారం రాహువు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రెండు నెలల కిందట ఆ ప్రాంతం విస్తరణలో భాగంగా అక్కడి నవగ్రహాలలోని రాహువు విగ్రహం దెబ్బతినడంతో వాటి స్థానంలో నవ గ్రహాల పీఠంపై రాహువు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రెవెన్యూ, ఫైర్ సర్వీసు సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఈ సందర్భంగా హోమం, ప్రతిష్ఠ చేపట్టారు. జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్ భట్టర్, ఇతర అర్చక బృందం పాల్గొన్నారు.

నగరంలో చలివేంద్రాలు



చలివేంద్రాల ఏర్పాటు సందర్భంగా ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

కడప కల్చరల్: మండే ఎండలకు ఉపశమనం కలిగించేందుకు కడప నగరంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు హజరత్ సయ్యదా ఫాతిమా రజియావుల్లా అన్హ ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. నగరంలోని పాత మహిళా పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని చాంద్‌ఫిరా గుంబద్, చిలకలబావి, పాత మార్కెట్‌లో ఇప్పటికే వారు ఏర్పాటు చేసిన కేంద్రాలు ప్రజల దాహార్తి తీరుస్తున్నాయని ట్రస్టు సభ్యులు తెలిపారు. రోజూ 50 కూల్ వాటర్ క్యాన్లను చలివేంద్రాలలో ఉంచుతున్నామని, ఇందుకు అవసరమైన రవాణా, నిర్వహణ సిబ్బంది, విద్యుత్ ఖర్చులను తమ ట్రస్టు భరిస్తుందని పేర్కొన్నారు. ట్రస్టు చైర్మన్ హజరత్ మౌలాన మౌల్వి హఫీజ్ ఖ్వారీ, ఖ్వాజీ షేక్ మహమ్మద్ ఖలీలుల్లా సనాయి అమీరి, సభ్యుల సహకారంతో ఈ చలివేంద్రాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

9న బిషప్ పట్టాభిషేక మహోత్సవం


బిషప్ సగిలి ప్రకాశ్


కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లాకు చెందిన క్రైస్తవ ప్రముఖులు సగిలి ప్రకాష్ పట్టాభిషేక మహోత్సవం ఈ నెల 9న ఖమ్మంలోని దివ్య కారుణ్య బృహత్ దేవాలయం కరుణగిరి ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ తెలిపారు. ఆరోగ్యమాత చర్చిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం బిషప్‌గా సగిలి ప్రకాష్ వెళ్లిన విషయం తెలిసిందే అన్నారు. 9న ఖమ్మంలో జరిగే ఆయన పట్టాభిషేక మహోత్సవానికి ఫాదర్ ఎండీ.ప్రసాదరావు ఆధ్వర్యంలో 8న సాయంత్రం కడప, చిత్తూరు, పోరుమామిళ్ల, బద్వేలు తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేశారని తెలిపారు. కార్డినల్ పూల ఆంథోనీ (హైదరాబాద్ అతి మెత్రాణులు) ఖమ్మం, కడప అపోస్తులిక పాలన అధికారి ఉడుముల బాల, గాలి బాలి, నెల్లూరు పీఠాధిపతులు ఎండి ప్రకాశం ఆధ్వర్యంలో బిషప్ అభిషేక మహోత్సవం జరగనుందని తెలిపారు.

పెన్షన్ విధానంపై అవగాహన


బుక్‌లెట్ విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులందరూ తమ యొక్క సర్వీస్ రూల్స్‌తోపాటు ఉద్యోగ విరమణ అనంతరం తమకు వర్తించే పెన్షన్ విధానంపై అవగాహన కలిగి ఉండాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. కడప మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుక్‌లెట్ అందజేశారు. మహేష్ బాబు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం ప్రాధాన్యం, సీపీఎస్ మరియు జీపీఎస్ పెన్షన్ విధానాలతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదవీ విరమణ అనంతరం కలిగే నష్టాలను తెలియచేసే విధంగా బుక్‌లెట్ రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు చెరుకూరు శ్రీనివాసులు, సిప. రమణ, నాయకులు గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

13 గడ్డివాములు దగ్ధం


పోట్లదుర్తి గ్రామంలో దగ్ధమైన గడ్డి వాములు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో రైతులకు చెందిన 13 గడ్డి వాములు దగ్ధమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పోట్లదుర్తి గ్రామానికి చెందిన 9 మంది రైతులకు చెందిన గడ్డి వాములకు అగ్ని అంటుకుని 13 గడ్డి వాములు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే గడ్డి వాములు పూర్తిగా కాలిపోయాయి. రూ.13 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

రంజాన్ మాసం.. ఎంతో పవిత్రమైనది


ఉపవాస దీక్ష విరమిస్తున్న విద్యార్థులు, అతిథులు


మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగర శివార్లలోని ఫాతిమా వైద్య కళాశాల ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాష, నగర మేయర్ సురేష్‌బాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ఈ మాసంలో ప్రతి ముస్లిం ఉపవాస దీక్షలు చేపట్టి పవిత్ర ఖురాన్ పఠనంతో అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకుంటారన్నారు. ఇలాంటి పవిత్ర కార్యక్రమంలో తాము భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ముస్లిం సమాజానికి ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నామని వివరించారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాష మాట్లాడుతూ ఈ రంజాన్ మాసంలో ఎంతో కఠోరమైన ఉపవాస దీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ మాసం చివరి పది రోజుల్లో షబ్బే ఖదర్ వస్తుందని, ఆరోజున పవిత్ర ఖురాన్ ఆవిర్భవించిందని తెలిపారు. ఈ రాత్రుల్లో జాగరణ చేస్తూ ఖురాన్ పఠిస్తూ అల్లాహ్ కృపకు దగ్గర కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారన్నారు. కళాశాల సెక్రటరీ జవ్వాద్ ఏక్యూ మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రతి ముస్లిం సర్వమానవాళికి ఎంతో పవిత్రమైందన్నారు. ఈ మాసంలో ప్రతి ముస్లిం విశొడి జకాత్, పేదవారికి ఫిత్రా అందించి వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతారన్నారు. ఇది మహా ప్రవక్త నుంచి వచ్చిన సంప్రదాయమన్నారు. రంజాన్ మాసంలో ఉండే ఉపవాసాలు సైంటిఫిక్‌గా ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయన్నారు. అనంతరం భక్తులతో కలిసి అతిథులు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఈడీ సల్మాన్ ముర్తజా, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శైలజ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఓబులేశు, డైరెక్టర్ డాక్టర్ జయరామిరెడ్డి, వైద్యులు, 2019 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో మత సామరస్యం

కడప కార్పొరేషన్: ఇఫ్తార్ విందులతో అన్ని వర్గాల ప్రజల మధ్య సోదరభావం, మత సామరస్యం ఏర్పడుతుందని కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్ బాషా, ఎమ్మెల్సీ ఎంవీ. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వినాయకనగర్‌లో ఆటో నగర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వశాంతి కోసం అల్లాహ్‌ను ప్రార్థించాలన్నారు. దైవారాధన, ధార్మిక చింతనకు, క్రమశిక్షణ, దాతృత్వానికి రంజాన్ మాసం ప్రతీక అన్నారు. మనిషి సత్ప్రవర్తనలో నడవడానికి ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, పి.జయచంద్రారెడ్డి, మైనార్టీ నాయకులు అహ్మద్‌బాషా, నబీ రసూల్, జమాల్‌వలి, ఎన్. సుబ్బారెడ్డి, ఉమైర్, బంగారు నాగయ్య, మియ్యా, సుభాన్‌బాషా, సొహల్ అహ్మద్, జమీల్, షఫీ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి వలసల వెల్లువ


ఓబుల్‌రెడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీలో చేరినవారితో సాయినాథ శర్మ

వీరపునాయునిపల్లె : మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వలసల వెల్లువ కొనసాగుతోంది. శుక్రవారం సాయినాథ్ శర్మ ఆధ్వర్యంలో ఆయన అనుచర వర్గం మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి సమక్షంలో 50 కుటుంబాలు పార్టీలోకి చేరాయి. మద్దిపల్లెలో సుధాకర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటక్రిష్ణారెడ్డి, రామగంగిరెడ్డి మరో 15 కుటుంబాలు, ఓబుల్‌రెడ్డిపల్లెలో శ్రీరాములు, లక్ష్మయ్య, బ్రహ్మయ్య, హరి, యల్లప్ప, నాగార్జున, బాలరాజు, హరిశంకర్‌లతో పాటు 25 కుటుంబాలు, వీరపునాయునిపల్లెలో 10 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి సాయినాథ శర్మ, రఘునాథరెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం సాయినాథ శర్మ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో నీతికి నిజాయితీకి యుద్ధం జరగబోతోందని ఈ యుద్ధంలో మనమందరమూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని అందుకు సైనికుల్లా పనిచేయాలని ఆయన వారిని కోరారు. పేద ప్రజలకు సేవచేయాలన్న ఒకే ఒక లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారన్నారు. అటువంటి నాయకుడికి అండగా నిలబడాలన్నారు. మన కుటుంబాన్ని ఎంత బాధ్యతగా చూసుకుంటామో జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకునేందుకు అంతకంటే ఎక్కువగా బాధ్యత తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని మూడవ సారి ఎమ్మెల్యేగా గెలిపించుకుని రికార్డును సృష్టించాలన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని గతంలో కంటే ఎక్కువ మెజారిటీతో గెలిపించాలన్నారు. రాష్ట్రం సర్వ నాశనం కాకుండా ఉండాలంటే చంద్రబాబు కూటమికి మనము తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వీరపునాయునిపల్లె ఎంపీటీసీ రాఘవ యాదవ్, పాయసంపల్లె ఎంపీటీసీ రామాంజనేయరెడ్డి, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, ప్రతాప్ యాదవ్, సాంబశివారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలకు రిజర్వేషన్లు కొనసాగాలంటే జగనన్న రావాలి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న హజ్ కమిటీ సభ్యులు

జమ్మలమడుగు : రాష్ట్రంలో ముస్లింలకు రిజర్వేషన్లు కొనసాగాలంటే తిరిగి అధికారంలోనికి వైఎస్సార్‌సీపీ రావాలని హజ్ కమిటీ చైర్మన్ బద్వేలు గౌస్‌లాజం తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మదీనా, నూర్ మసీదులలో ప్రార్థనల అనంతరం వచ్చిన వారికి ప్రభుత్వం ముస్లింలకు చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోనికి వచ్చిన తర్వాత నిరుపేదలకు మధ్యతరగతి ప్రలజలకు సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ముస్లిం మైనార్టీలకు అసరాగా నిలవడంతోపాటు, రాజకీయంగా శాసనసభలో మైనార్టీలకు అవకాశం కల్పించిన ఏకైక నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక ముస్లింలను కలిసి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలంటూ విన్నవించారు. రాష్ట్రంలో హజ్ చేసే 3529 మంది యాత్రికులకు రూ.19.54 కోట్లు ఖర్చుచేశారన్నారు. ఆదేవిధంగా మసీదులో సేవలందించే ఇమాంలకు, మౌజన్‌లకు ప్రతినెల గౌరవ వేతం కింద రూ.346 కోట్ల ఖర్చు చేశారన్నారు. శాసనసభలో నలుగురు ఎమ్మెల్యేలు, శాసనమండలిలో నలుగురు సభ్యులు, మేయర్లుగా ఇద్దరిని, జడ్పీ వైస్ చైర్మన్‌గా ఒకరిని, మున్సిపల్ చైర్మన్లుగా 11 మందిని ఎంపీటీసీ, జడ్పీటీలలో పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీలకు అవకాశం కల్పించిన నాయకుడు జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో షామీర్ ఆలీ, దాదాపీర్ అన్సర్ పాల్గొన్నారు.

ఉగాది పండుగపై అపోహలు వద్దు

పులివెందుల : హిందూవులకు అతిముఖ్యమైన, ప్రధానమైన ఉగాది పండుగపై అపోహలు వద్దని పురోహితులు, పంచాంగ విశ్లేషకులు వేదపండితులు రామ్‌కుమార్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉగాది యుగ ఆది అనే వాఖ్యం నుంచి ఏర్పడిందన్నారు. తెలుగు సంవత్సరం ప్రారంభదినం దీనినే ఉగాది పండుగ అంటారు. సంవత్సరం ప్రారంభం రోజు కావున తలంటుస్నానం చేసి నూతనవస్త్రాలు ధరించి తమ ఇంటి దేవునికి నైవేద్యం సమర్పించి తదుపరి పంచాంగశ్రవణం ఈ సంవత్సరం ఎలా ఉంది అని పురోహితులను అడిగి తెలుసుకుంటారన్నారు. ఈ సంవత్సరం ఉగాది మంగళవారం వచ్చిందని, పండుగ ముందురోజు 8వ తేదీ సోమవారం సూర్యగ్రహణం ఉందని చాలా మందికి అపోహలు ఉన్నాయన్నారు. 8వ తేదీ సోమవారం సూర్యగ్రహణం లేదని, భారతదేశానికే కాకుండా ఏదేశంలో కూడా సూర్యగ్రహణం లేదని ఉగాది పండుగ, దీపావళి అమావాస్య పండుగలు ఏరోజు వచ్చినా ఆ రోజు తలంటుస్నానం ఆచరించవచ్చునని, నూతన వస్త్రాలు ధరించవచ్చని, చైత్రశుద్ధపాడ్యమి ఏ రోజు వచ్చినా ఆ రోజు పండుగ ఆచరించదగినదన్నారు. కావున ప్రజలు ఈనెల 9వ తేదీన ఉగాది పండుగ ఆచరించాలని ఆయన తెలియజేశారు.

విధులను అంకితభావంతో నిర్వహించాలి

జమ్మలమడుగు రూరల్ : మైలవరం మండల విద్యాశాఖాధికారి క్రిష్టఫర్ విధులను అంకితభావంతో నిర్వహించేవారని జిల్లా ఉప విద్యాశాఖాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మార్చి 31వ తేదిన పదవీ విరమణ పొందిన క్రిష్టఫర్‌ను శుక్రవారం మండల ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మైలవరం మండల విద్యాశాఖాధికారి బత్తిని చిట్టిబాబు అధ్యక్షతన వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ మండలాల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

8 నుంచి గంగమ్మ జాతర

కడప కల్చరల్: కడప నగరం హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ ఆలయ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నామని గోపాల్‌సింగ్ తెలిపారు. 8న సాయంత్రం 7.30 గంటలకు అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. 9న శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని సాయంత్రం 6.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో పంచాంగ పఠనం ఉంటుందన్నారు. 10వ తేదిన ఉదయం 9 గంటలకు అమ్మవారికి చల్ల సమర్పణ, 11న ఉదయం 8 గంటలకు జలాభిషేకం, 12న ఉదయం 5.00 గంటలకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 3.00 గంటల వరకు వడిబియ్యం, 5 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం ఉంటుందని వెల్లడించారు. 13న ఉదయం 10 గంటలకు వసంతోత్సవం, రాత్రి 8.00 గంటలకు పుష్పయాగం, 14న ఉదయం 8 గంటలకు మహానైవేద్యం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, రాత్రి 7 గంటలకు పల్లకీ సేవ, 8 గంటలకు పవళింపు సేవ చేపడతామని ఆయన వివరించారు.

9న ఇంటాక్ ఉగాది వేడుకలు

కడప కల్చరల్: భారత జాతీయ కళా వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఈ నెల 9వ తేదీ ఉదయం 9.00 గంటలకు నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలో గల మానస ఇన్ సమావేశ మందిరంలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఇంటాక్, అనుబంధ సంస్థలైన లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సభ్యులు హాజరు కావాలని కోరారు. ఈ వేడుకల్లో భాగంగా ఉగాది పంచాంగ పఠనం, కవి సమ్మేళనంతోపాటు 12 సంవత్సరాలలోపు చిన్నారులకు సంప్రదాయ వస్త్రధారణ పోటీ నిర్వహించి బహుమతులు అందిస్తామని ఆయన తెలిపారు.

గోదాము తనిఖీ


స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని అక్కాయపల్లెలోని గోదామును నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, కార్మికులకు వాష్ రూమ్‌లు నిర్మించాలని ఆదేశించారు. మలేరియా డేటాను కంప్యూటర్‌లో పొందుపరచాలని, మలేరియా వింగ్‌కు ప్రత్యేక ఈమెయిల్ ఐడీని సృష్టించాలని ఆదేశించారు. ప్రధాన కాలువల్లో జూన్ లోపు పూడిక తీయాలని, పెద్ద కాలువల్లో చెత్త వేరు చేయడానికి గ్రిల్డ్ మెస్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కడప నగరంలో ఉన్న 287 పోలింగ్ స్టేషన్లలో వ్యర్థాల తొలగింపునకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డా. చంద్రశేఖర్, మలేరియా అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్‌బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి


పార్టీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

కడప కార్పొరేషన్: అణగారిన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని, అంటరానితనం నిషేధమే లక్ష్యంగా ఆయన పనిచేశారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి అన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు మహవీర్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1946లో నెహ్రూ ప్రధానిగా ఏర్పడిన తాత్కాలిక మొదటి మంత్రి మండలిలో జగ్జీవన్‌రామ్ కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారని, అప్పటి నుంచి 29 ఏళ్ల కేంద్రమంత్రిగా, ఉప ప్రధానిగా అనేక పదవులు అలంకరించి ప్రజలకు సేవలందించారన్నారు. మూడు దశాబ్దాలపాటు ఎంతో ప్రజ్ఞాపాటవాలతో, బాధ్యతతో నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్, నగర అధ్యక్షుడు ఎన్.సుబ్బారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు త్యాగరాజు, సమరనాథరెడ్డి, ఆర్‌వీ రమణ, కంచుపాటి బాబు, అర్జున్, లక్ష్మీనారాయణ,శ్రీరంజన్‌రెడ్డి, లక్ష్మయ్య, మహిళా నేతలు రత్నకుమారి, క్రిష్ణవేణి, పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకులో జగ్జీవన్‌రామ్ జయంతి

కడప అగ్రికల్చర్: బాబు జగజ్జీవన్‌రామ్ గొప్ప స్వాతంత్ర సమరయోధుడని కడప డీసీసీ బ్యాంకు సీఈఓ రాజామణి, స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ గురప్ప పేర్కొన్నారు. కడప డీసీసీ బ్యాంకులో బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1971 భారత్, పాకిస్తాన్ యుద్ధ సమయంలో రక్షణశాఖమంత్రిగా భారత విజయానికి జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారన్నారు. డీసీసీ బ్యాంకు సలహాదారు సహదేవ రెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : పేద వర్గాల అభ్యుదయానికి అలుపెరగని కృషి చేసిన బాబు జగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ప్రధానిగా దేశ సేవకు అంకితమైన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు.ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, మునయ్య, గంగా సురేష్ ,తదితరులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో..

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్ముని అడుగుజాడల్లో నడుస్తూ జగ్జీవన్‌రామ్ సాంఘిక దురాచారాలపై పోరాడారన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వం, అంటరానితనం నిషేధం, జమీందారి వ్యవస్థ రద్దు వంటి విషయాలను స్వాతంత్ర్యానికి ముందే ప్రజలకు పరిచయం చేసిన సమతావాది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ వై.పవన్‌కుమార్ రెడ్డి, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్, ఎస్‌ఎస్ఎస్ పీఓలు ప్రదీప్‌కుమార్, రమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని ఆర్‌ఎస్ వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమలు కోసం జగ్జీవన్‌రామ్ చట్ట సభల్లో పోరాటం చేసిన సామాజిక, సంఘ సంస్కర్త అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్రబాబు, నగర నాయకులు వేణు,నవీన్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నివాళి

కడప రూరల్: బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఏపీ ఎమ్మార్పీఎస్ నేతలు కొనియాడారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు బీసీ గంగులు, అంజనేయులు, ఎం ఓబులేసు, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

కడప ఎడ్యుకేషన్: బ్రిటీష్ ప్రభుత్వ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన భారతమాత ముద్దు బిడ్డ బాబూ జగ్జీవన్‌రామ్ అని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తెలిపారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని కడప యూటీఎఫ్ భవన్‌నందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం నంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం కేంద్ర మంత్రిగా పనిచేసి కార్మికుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు ఈ కార్యక్రమంలో నరసింహారావు, రమణ, ప్రభాకర్, చంద్రశేఖర్, గోపీనాథ్, కిరణ్‌కుమార్, చెన్నకేశవులు, కొండయ్య, ఎల్లయ్య, సిద్ధయ్య పాల్గొన్నారు.

సమతావాదికి నీరాజనాలు

కడప సెవెన్‌రోడ్స్: దేశ స్వాతంత్ర్యంతోపాటు సామాజిక వివక్షకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేసిన యోధుడు బాబు జగ్జీవన్‌రామ్ అని ఏపీ దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.రామాంజనేయులు కొనియాడారు. జగ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకల సందర్భంగా కలెక్టరేట్ సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరయ్య, జిల్లా నాయకులు గన్నెపాటి వెంకటరమణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యవేదిక ఆధ్వర్యంలో

చేతివృత్తుల జాతీయ ఐక్యవేదిక పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ ఈ సందర్భంగా ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జీఆర్‌ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో

గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేశు, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్దిఖ్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నగర ప్రధాన కార్యదర్శి తరుణ్, నాయకులు నవీన్, హనీష్, దీపక్, శ్రావణ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



బాబు జగజ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డీసీసీ బ్యాంకు సిబ్బంది


బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు


బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న యూటీఎఫ్ నాయకులు